కవిత అక్రమ అరెస్టుపై నిరసనలు

- కక్షపూరితంగానే అరెస్ట్ : మాజీ మంత్రి ఎర్రబెల్లి
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ సర్కారు
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- పలు చోట్ల బీఆర్ఎస్ నాయకుల ఆందోళనలు

వర్ధన్నపేట/హనుమకొండ, మార్చి 16: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టుపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కవితను అరెస్టు చేయడం అంటే దేశంలోని మహిళలపై ఉక్కుపాదం మోపినట్టేనని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీజేపీ కక్షపూరితంగా అరెస్ట్ చేయించిందని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ మద్యం కేసుతో కవితకు ఎలాంటి సంబంధం లేకపోయినా రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కుట్రలు పన్ని అక్రమ కేసులు బనాయించాయని విమర్శించారు. ఆయా పార్టీల కుట్రలను బీఆర్ఎస్ ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటుందని హెచ్చరించారు. ధర్నాలో ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ భిక్షపతి, ఇండ్ల నాగేశ్వర్ రావు, చింతల యాదగిరి, తూళ్ల కుమారస్వామి, మనోజ్‌కుమార్, రజణీ, గోపాల్‌రావు, పూజారి రఘు, రవి పాల్గొన్నారు. అలాగే, కవిత అరెస్టుకు నిరసనగా బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో కాళోజీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడే రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దాస్యం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి, మోదీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా సీబీఐ, ఐటీ, ఈడీ దాడులు చేయించి అక్రమ అరెస్టులు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ముందస్తు సమాచారం లేకుండా ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం బీజేపీ కుట్రేనని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆరోపించారు. ఎన్నికల ముందు ఈడీ వస్తుందనే నిజం తేటతెల్లమైందన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, కార్పొరేటర్లు సోదా కిరణ్, ఇమ్మడి లోహిత, బొంగు అశోక్ యాదవ్, దేవరకొండ విజయలక్ష్మి, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్లు తాళ్లపల్లి జనార్ధన్‌గౌడ్, పులి రజినీకాంత్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు నయీముద్దీన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అక్రమం

గిర్మాజీపేట : ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అక్రమమని, వచ్చే ఎంపీ ఎన్నికల్లో లబ్ధి కోసమే బీజేపీ చిల్లర చేష్టలు చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా కార్పొరేటర్ గందె కల్పనా నవీన్ ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో నిరసన తెలిపారు. డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, కార్పొరేటర్లు మరుపల్ల రవి, సిద్ధం రాజు, బోగి సువర్ణా సురేశ్, మాజీ కార్పొరేటర్లు రాజేందర్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, అనిల్, అజయ్ పాల్గొన్నారు.

నిరసనల వెల్లువ

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్ : ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా పలు చోట్ల బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టారు. నర్సంపేట పట్టణంలోని అమరవీరుల సెంటర్‌లో బీఆర్ఎస్ నర్సంపేట మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే, నల్లబెల్లి మండలకేంద్రంలో కూడా పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్‌రావు ఆధ్వర్యంలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఖానాపురంలో నిర్వహించిన నిరసనలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు. నెక్కొండలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు సంగని సూరయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి పాల్గొన్నారు. ఎల్కతుర్తిలో ప్రధాన రహదారిపై ఎంపీపీ మేకల స్వప్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. పరకాల పట్టణంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మడికొండ శ్రీను, మండలాధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం హేయమైన చర్య అని భారత జాగృతి యువజన రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ అన్నారు.

ఖానాపురం : ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నల్లబెల్లి : మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

నెక్కొండ : రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్కతుర్తి : నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

భీమదేవరపల్లి : ముల్కనూరులో రాస్తారోకో చేస్తున్న నాయకులు

నడికూడ: పరకాలలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

శిరీష ఫీటల్ మెడిసిన్ సెంటర్‌లో అధునాతన వైద్యం

హనుమకొండ చౌరస్తా, మార్చి 16 : ఓ తల్లి గర్భంలో ముగ్గురు శిశువులు ఒకే అమ్నిఓటిక్ పొరతో కప్పబడి ఉండగా అధునాతన చికిత్స చేసి ఒక శిశువును తొలగించామని, వరంగల్‌లో మొదటిసారి ఈ విధానంలో చికిత్స అందించామని శిరీష ఫీటల్ మెడిసిన్ సెంటర్ వైద్యురాలు శిరీష తెలిపారు. వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన 15 వారాల గర్భవతి గుగులోత్ సంతోష(29) చికిత్స కోసం దవాఖానకు రాగా, ఆమె గర్భంలో ఒకే పొర కింద ముగ్గురు శిశువులు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో ముంబై నుంచి ప్రత్యేకమైన లేజర్ మిషన్ తెప్పించి లేజర్ ఫైబర్‌ను పంపించి ఒక శిశువును తొలగించామన్నారు. అత్యంత క్లిష్టమైన, అరుదైన శస్త్రచికిత్సను హనుమకొండలో నిర్వహించామని, హైదరాబాద్‌లో ఇలాంటి చికిత్స ఒకరిద్దరికి చేశారని చెప్పారు. హైదరాబాద్‌లో రూ.75 వేల నుంచి రూ.90 వేల ఖర్చు కాగా, హనుమకొండలో రూ.35 వేలతో చికిత్స అందించామని, ప్రస్తుతం తల్లితో పాటు ఇద్దరు శిశువులు క్షేమంగా ఉన్నారని డాక్టర్ శిరీష తెలిపారు.

చంద్రబోస్‌కు డాక్టరేట్‌ను ప్రధానం చేస్తున్న చాన్సలర్, వీసీ

ఘనంగా 'ఎస్సార్' స్నాతకోత్సవం

సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు డాక్టరేట్ ప్రదానం

హసన్‌పర్తి, మార్చి 16: అనంతసాగర్‌లోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో శనివారం ప్రథమ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చాన్సలర్ ఏ వరదారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ కమిటీ చైర్మన్, ప్రొఫెసర్ అనిల్ సహస్ర బుద్ధే పాల్గొని మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, డ్రోన్స్, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికతతో నేటి ప్రపంచం ముందుకెళ్తున్నదన్నారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ ఎస్సార్ విశ్వవిద్యాలయం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం హర్షణీయమన్నారు. అనంతరం సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కనుకుంట్ల సుభాష్ చంద్రబోస్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి గౌరవించారు. కార్యక్రమంలో ప్రో చాన్సలర్ ఏ మధుకర్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనరెడ్డి, కాన్వొకేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ సీవీరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళీ మాడ వీధుల పనులు ప్రారంభం

వరంగల్, మార్చి 16 : భద్రకాళీ ఆలయం చుట్టూ నిర్మించనున్న మాడ వీధుల పనులకు శనివారం ఆలయ ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు, ఈవో శేషుభారతి, కుడా ప్లానింగ్ అధికారి అజిత్‌రెడ్డి భూమి పూజలు చేశారు. మాడవీధుల నిర్మాణం కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ. 30 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లు, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ రూ.10 కోట్లు ఖర్చు చేయనున్నది. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయినందున అధికారులు పనులను ప్రారంభించారు. భద్రకాళీ ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయకుమార్, కుడా ఈఈ భీమ్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీ పసునూరి దయాకర్

హనుమకొండ, మార్చి 16 : బీఆర్ఎస్ ఎంపీ పసునూరి దయాకర్ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మహేశ్ కుమార్‌గౌడ్ పసునూరి దయాకర్‌కు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

పసునూరికి కండువా కప్పుతున్న మహేశ్ కుమార్ గౌడ్

బీఆర్ఎస్‌కు అరూరి రాజీనామా

హనుమకొండ, మార్చి 16 : మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు లేఖ విడుదల చేశారు. తన రాజీనామాను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలో అవకాశాలు కల్పించిన పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు.

కొమ్మాల జాతరకు వేళాయె..

గీసుగొండ, మార్చి 16 : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభం కానున్నాయి. స్వామి వారి జాతర ఏటా హోలీ పర్వదినం తర్వాత వారం రోజుల పాటు సాగుతాయి. ఈ నెల 31న జాతర ముగుస్తుందని ఈవో వేషగిరి తెలిపారు. కాగా, జాతర సమీపిస్తుండడంతో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రధాన రహదారిని రూ.10 లక్షలతో వెడల్పు చేస్తున్నారు. మరో రూ.7లక్షలతో సైడ్ డ్రైనేజీలు, రూ.60 లక్షలతో మరుగుదొడ్ల పనులు సాగుతున్నాయి. రూ.10 లక్షలతో నాచినపల్లి రోడ్డు వెడల్పు చేయనున్నారు. కాగా, ఈ నెల 25న జరిగే కొమ్మాల జాతరకు రావాలని మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి అర్చకులు రామాచార్యులు, విష్ణుచార్యులు, ఈవో శేషగిరి ఆహ్వాన పత్రిక అందజేశారు. కాగా, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొమ్మాల జాతరలో రాజకీయ ప్రభలకు అనుమతి లేదని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఏసీపీ తిరుపతి, సీఐ పవన్‌కుమార్, ఎస్సైలు వెంకన్న, జానీ పాషా, పరమేశ్, నగేశ్ పాల్గొన్నారు.

దామెరను దత్తత తీసుకున్న కేఎంసీ విద్యార్థినులు

దామెర, మార్చి 16 : వరంగల్ కేఎంసీలో ఎంబీబీఎస్ అభ్యసిస్తున్న 125 మంది విద్యార్థినులు దామెరలోని కుటుంబాలను శనివారం దత్తత తీసుకున్నారు. పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన కేఎంసీ ఎస్‌పీఎం(సోషల్ ప్రివెన్షన్ మెడిసిన్)లో భాగంగా ప్రొఫెసర్లు నిర్మల, మురళి పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు ఐదు కుటుంబాలను దత్తత తీసుకుని వైద్యసేవలు అందిస్తారన్నారు. తహసీల్దార్ జ్యోతీవరలక్ష్మి, ఎంపీడీవో కల్పన, డాక్టర్ మంజుల, సూపర్‌వైజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తాం : ఎమ్మెల్యే రేవూరి

గీసుగొండ, మార్చి 16 : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ 15,16వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు కొండేటి కొమురారెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వర్ధన్నపేట/ఐనవోలు/పర్వతగిరి, మార్చి 16 : మండలంలోని చెన్నారం, నల్లబెల్లి, ఇల్లంద, రామవరం, వర్ధన్నపేటలో సీసీరోడ్లు, బోర్లు తదితర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శనివారం శంకుస్థాపన చేశారు. అలాగే, ఐనవోలు మండలం కొండపర్తి, చింతకుంట క్రాస్ నుంచి పంథిని గ్రామానికి మంజూరైన కట్ట మరమ్మతులు, బీటీరోడ్డు పనులను ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు. అంతేకాకుండా పర్వతగిరి మండలం కొంకపాకలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం గోపనపెల్లిలో దూడెల మల్లన్న ఆలయ నూతన చైర్‌పర్సన్ రాధికతో ప్రమాణ స్వీకారం చేయించారు. జేడీఏ ఉషాదయాళ్, ఏవో ప్రశాంత్‌కుమార్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీటీసీ మోహన్‌రావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL (PRINCIPAL DISTRICT JUDGE) AT HANAMKONDA

O.P. NO. 878 OF 2022

Between:
Kadari Sarangam & others ....Petitioners
And
Peddaboina Vishnu & others .....Respondents

NOTICE

To:
Ravula Krishna, S/o. Janardhan, Aged: 38 years, Occu: Owner of the crime vehicle, R/o. Vinayaka Nagar, KUC Road, Hanumakonda. (Respondent No.2)

Please take notice that the above O.P., filed by the petitioners against you and others for grant of compensation on account of injuries caused to the petitioner and the said case is posted on 18-03-2024 for your appearance. Therefore, you are hereby ordered to appear before the said Court on the above said date at 10-30 A.M., either in person or through an Advocate, failing which the matter will be decided exparte.

// BY THE ORDER OF COURT//
Sd/- **P. BHADRAIAH**
Advocates.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

వెంకన్న(ఫైల్)

పర్వతగిరి, మార్చి 16: తీగపై బట్టలు ఆరేస్తుండగా విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన రావూర్ శివారు గుగులోత్‌తండాలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ వెంకన్న (28) శనివారం ఉదయం దుస్తులు ఆరేస్తుండగా తీగకు కరెంట్ సరఫరా అయింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్న భార్య చిట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బలవంతంగా వ్యభిచారంలోకి..

తప్పించుకున్న అమ్మాయి

నయీంనగర్, మార్చి 16 : యువతిని బలవంతంగా వ్యభిచార ఊబిలోకి నెట్టేందుకు ఓ మహిళ ప్రయత్నించింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రేటర్ విలీన గ్రామానికి చెందిన ఓ మహిళ మూడు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి ఓ అమ్మాయిని తీసుకొచ్చి బలవంతంగా వ్యభిచారం చేయించాలని చూసింది. అయితే, ఆ అమ్మాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్కడి నుంచి తప్పించుకుని ఔటర్ రింగ్‌రోడ్డుపై పరిగెత్తుకుంటూ వెళ్తుండగా, కొందరు యువకులు చూసి వివరాలు తెలుసుకుని స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిసింది. పోలీసులు ఆ అమ్మాయిని విచారించి, హోమ్‌లో ఉంచినట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రైనేజీలో శిశువు మృతదేహం

సుబేదారి, మార్చి 16 : సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలోని హంటర్ రోడ్డు సహకార నగర్‌లో డ్రైనేజీలో శనివారం పారిశుధ్య సిబ్బంది శిశువు మృతదేహాన్ని గుర్తించారు. సిబ్బంది డ్రైనేజీ నుంచి చెత్త తీసి ట్రాక్టర్‌లో పోస్తున్న క్రమంలో కుక్కలు పీక్కుతిన్న కుళ్లిపోయిన దశలో ఉన్న రెండు, మూడు రోజుల వయసు ఉన్న శిశువు మృతదేహం కనిపించింది. దీంతో వారు శానిటరీ జవాన్ సుబేదా బేగంకు సమాచారం అందించారు. ఆమె సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

నడికూడ, మార్చి 16 : కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పొలాల్లో బోల్తా కొట్టిన ఘటన మండల కేంద్రం శివారులో జరిగింది. ఎల్కతుర్తికి చెందిన కుటుంబం వివాహ కార్యక్రమానికి హాజరై వస్తుండగా పరకాల –హుజూరాబాద్ రహదారిలో డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడింది. కాగా, కారులో ప్రయాణిస్తున్న వారంతా సురక్షితంగా బయటపడ్డారు.

కొడుకు చావుకు కారణమైన భర్తపై మహిళ ఫిర్యాదు

వేలేరు, మార్చి 16 : తన బిడ్డ చావుకు కారణమైన భర్తపై ఓ మహిళ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై హరిత తెలిపారు. బీహార్ రాష్ట్రం నుంచి కూలి పనుల కోసం వచ్చిన మహిళ రాధా పాశ్వాన్ తన భర్త దిలీప్‌తో కలిసి వేలేరు మండలం మద్దెలగూడెంలో ఉంటోంది. శుక్రవారం సాయంత్రం తన నాలుగో కుమారుడు అభిరాజ్(3)ను తండ్రి దిలీప్ కోళ్ల ఫాంలోకి తీసుకెళ్లి దాణా మిషన్‌పై కూర్చోబెట్టి పనులు చేసుకున్నాడు. దిలీప్ భార్య అక్కడికి వచ్చి కొడుకు ఎక్కడ అని అడగ్గా, దాణా మిషన్‌పై కూర్చోబెట్టానని చెప్పాడు. అక్కడికి వెళ్లి చూడగా, అభిరాజ్ దాణా మిషన్‌లో పడి చనిపోయినట్లు గుర్తించింది. అజాగ్రత్తగా వ్యవహరించి కొడుకు మృతికి కారణమైన తన భర్తపై ఆమె ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విచారణ చేపట్టిన ఎంఈవో

కరీమాబాద్, మార్చి 16 : వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోటలోని వాణి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థినిని పీఈటీ చితకబాదిన ఘటనలో శనివారం అధికారులు విచారణ చేపట్టారు. ఎంఈవో విజయ్ కుమార్, మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య స్కూల్‌కు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని ఎంఈవో తెలిపారు.విద్యార్థి సంఘాల నాయకులు గడ్డం నాగార్జున, లాదెళ్ల శరత్, యార ప్రశాంత్, చుక్క ప్రశాంత్ పాల్గొన్నారు.

నిట్‌లో ఈ-సమ్మిట్

హనుమకొండ చౌరస్తా, మార్చి 16 : వరంగల్ నిట్‌లో సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్‌పై రెండు రోజుల ఈ–సమ్మిట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి అతిథులుగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ సోమశేఖర్, సైబర్ సెక్యూరిటీ డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఈవో డాక్టర్ శ్రీరామ్ హాజరయ్యారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మెగా జాబ్ మేళాలో సీపీ అంబర్ కిశోర్ ఝా

యువతికి నియామక పత్రం అందజేస్తున్న సీపీ

సుబేదారి, మార్చి 16 : యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. టీఎంఐ ఫౌండేషన్ సహకారంతో వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో హనుమకొండ కాకతీయ డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను సీపీ ప్రారంభించారు. జాబ్ మేళాకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 1349 మంది నిరుద్యోగ యువత తరలివచ్చారు. 25 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి, 164 మందికి నియామక పత్రాలు అందజేశారు. యువతకు పోలీసులు తాగునీరు, భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి, టీఎంఐ ఫౌండేషన్ చైర్మన్ మురళీధరన్, ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, తిరుమల్, సీఐలు సతీశ్, సంజీవ్, సత్యనారాయణరెడ్డి, షుకూర్, కేడీసీ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి పాల్గొన్నారు. కాగా, హనుమకొండకు వచ్చిన హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధేను సీపీ అంబర్ కిశోర్ ఝా మర్యాద పూర్వకంగా కలిశారు. నిట్ అతిథి గృహంలో చీఫ్ జస్టిస్‌కు సీపీ పూలమొక్క అందజేశారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి : మేయర్

మహిళా కార్పొరేటర్లతో మేయర్, కమిషనర్

వరంగల్, మార్చి 16 : మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో బల్దియా, మెప్మా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆకాశాన్ని తాకే తత్వగుణం మహిళలకు మాత్రమే ఉంటుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. హనుమకొండ, వరంగల్ పాలనాధికారులు, నగర ప్రథమ పౌరురాలిగా మహిళలు ఉండడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, తూర్పాటి సులోచన, దివ్యారాణి, జక్కుల రజిత, జన్ను షీభారాణి, గుజ్జుల వసంత, అరుణా కుమారి, గుండు చందన, బస్వరాజు శిరీష, రామా తేజస్విని, భోగి సువర్ణ, మానస, ఈదురు అరుణ, జలగం అనిత పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసేందుకు అధికారులు కృషి చేయాలి

వరంగల్, మార్చి 16 : నగర ప్రజలకు సేవలు అందించేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. శనివారం కార్పొరేషన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పక్షం రోజుల్లో పన్నుల సేకరణ వంద శాతం పూర్తి చేయాలన్నారు. అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో రాజేశ్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఈఈలు శ్రీనివాస్, సంజయ్‌కుమార్, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, డీఎఫ్‌వో శంకరలింగం పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి..

వరంగల్ : ఎన్నికల కమిషన్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఏఆర్‌వో, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్‌లో ఎన్నికల కమిషన్ నిబంధనలపై అధికారులకు అవగాహన కల్పించారు. నగరంలోని ప్రభుత్వ భవనాలు, గోడలపై రాజకీయ పార్టీల పెయింటింగ్స్, జెండాలు, పోస్టర్లను తొలగించాలన్నారు. వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వెబ్‌సైట్‌లో మంత్రుల ఫొటోలు తొలగించాలి

ఖిలావరంగల్ : ఎన్నికల కోడ్‌లో భాగంగా ప్రభుత్వ వెబ్‌సైట్లలో ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు తొలగించాలని వరంగల్ జిల్లా లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పీ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆమె అధికారులతో సమీక్షించారు. ఎన్నికల కోడ్‌పై అన్ని రాజకీయ పార్టీలకు సమాచారం చేరవేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన యాప్‌లు తక్షణమే పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సువిధా యాప్ ద్వారా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. 24 గంటలు కంట్రోల్ రూం పని చేయాలన్నారు. సీపీ అంబర్ కిశోర్‌ఝా మాట్లాడుతూ అధికారులందరూ అంకితభావంతో పని చేయాలన్నారు. సమీక్షలో గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి పాల్గొన్నారు.

ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి

హనుమకొండ : ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేసేలా స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో లోక్‌సభ ఎన్నికలపై స్వీప్ కార్యక్రమాల నిర్వహణకు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఓటర్లను ఆకట్టుకునేలా ప్రధాన కూడళ్లలో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీపీవో, స్వీప్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీ రమాకాంత్, డీఆర్డీవో నాగపద్మజ, జిల్లా సంక్షేమాధికారి మధురిమ, డీఈవో అబ్దుల్ హై, గ్రేటర్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టు భవన సముదాయం అత్యద్భుతం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే
- ఏసీబీ కోర్టు ప్రారంభం


హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పూల మొక్కను అందజేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

వరంగల్ లీగల్, మార్చి 15 : వరంగల్ జిల్లా కోర్టు సముదాయం అత్యద్భుతంగా ఉందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే అన్నారు. వరంగల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఏసీబీ కోర్టును శనివారం ఆయన ప్రారంభించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు హాజరయ్యారు. అలాగే హనుమకొండ సబ్‌కోర్టు ఈ సేవ డిజిటలైజేషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రోజు జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి వరంగల్, హనుమకొండ కోర్టులు ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. డిజిటలైజేషన్ ప్రారంభించడం తెలంగాణలో ఇదే ప్రథమమన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కోక రాధాదేవి, కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్ మోహన్, శ్యామ్ సుందర్ రావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులకు నిట్ వద్ద కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య పూల మొక్కలతో స్వాగతం పలికారు. న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు బుజ్జిబాబు, మల్లికార్జున్ సత్కరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

REAL ESTATE

శ్రీ లక్ష్మి గణపతి రియల్ ఎస్టేట్స్
★రామన్నపేటలో 204 G+2, 95 Lakhs, 204 కమర్షియల్ 1.65 Co., 181 ఓపెన్ ప్లాట్ 60 Lakhs, 25 గజాల కమర్షియల్ 16 Lakhs, ఓపెన్ 4 ప్లాట్స్, 20 గజాలు, 153 గజాలు, 1.50 Co.,. Cell: 9912244025, 9292104080.
NTW-323176

ఆదిత్య శ్రీ రియాల్టర్స్ & డెవలపర్స్
★మీకు సంబంధించిన ఖాళీ స్థలాలను గానీ, ఇళ్ళ స్థలాలను గానీ, వ్యవసాయ స్థలాలను గానీ, మాకు డెవలప్‌మెంట్ ఇవ్వండి మీరు ఆశించినంత పొందండి. సంప్ర: 9394326111, 7981174745.
NTW-323025

HMDA & RERA PLOTS
★3-5 సంవత్సరాలలో Future City బీబీనగర్‌లో 200 ఎ|| AIIMS హాస్పిటల్ దగ్గర్లో HMDA & RERA ప్లాట్లు 60% లోన్‌తో గేటెడ్ కమ్యూనిటీలో కలవు: 8109994456.
NT-320386

HOUSE FOR SALE

★కాజీపేట, సిద్ధార్థ నగర్, స్ట్రీట్ నెం.5లో గల H.No. 1-1-909, (181 Sq. Yards. ఇల్లుతో కలిపి) అమ్మబడును. సెల్: 8106019882, 8096677123.
NTW-323177

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

WANTED

jobs Apply Now!

★ఇంటర్, డిగ్రీ చదివి ఖాళీగా ఉన్న వారికి కంప్యూటర్ & ఇంగ్లీష్ కోర్సులు నేర్పి, కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు చూపించబడును. 7997997364/5.
NT-327958

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565